# గెలుపు(?)!

**-బలిజేపల్లి రాఘవరావు**

మండల కేంద్రానికి అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న చిన్న పల్లెటూరు 'దిబ్బవలస'! ఆ వూరికి బస్సు గాని, జీపుగాని కనీసం రిక్షా వెళ్ళడం కూడా కష్టమే! సుమారు మూడు వందల గడప వున్నా ఆ వూళ్లో పందు బాబు కుటుంబం మాత్రమే కాస్త సంపన్నమైంది! ఊళ్లో యెవరికి ఏ అవసరం వచ్చినా ఆదుకోగలిగిన వాడు పందుబాబు మాత్రమే! అందుకే అతనావూరికి సర్పంచిగా మూడు దశాబ్దాల నుండే ప్రజా సేవ చేస్తూ తరిస్తున్నాడు! ఆ వూళ్లో ఒక ఎలిమెంటరీ స్కూలు వుంది! కాని మాస్టరు లేదు! అందుకే ఎక్కువమంది ఐదో తరగతి చదువు ఆపేసిన వాళ్లే!

అంతా సవ్యంగా నడుస్తూ పోతున్న పందుబాబుకి ఇప్పుడో కొత్త సమస్య వచ్చింది! పంచాయతీ ఎన్నికలు ప్రకటించారు! అందుకేం భయపడలేదతను! ఇది వరకున్నా రెండు కుగ్రామాల్ని దిబ్బవలస పంచాయతీ నుండి విడదీసి, కొత్తగా రెల్లిపల్లి గ్రామాన్ని జత చేసేరు! ఆ రెండు గ్రామాల మధ్య దూరం అర కిలోమీటరు మాత్రమే! కాని, ప్రజల ఆలోచనల్లో ఆమడదూరం పైన వుంటుంది! దిబ్బవలస ప్రజలకి ఏకనాయకత్వం అయితే రెల్లిపల్లికి బహునాయకత్వం!.... అందుకే పందుబాబుకి బెదురు. రెండు వూళ్ళలోను ఎన్నికల వేడి బాగానే రాజుకుంది! మూడు పదుల నుండి సర్పంచ్‌గా వున్న పందుబాబుని మార్చి మరో కొత్త వ్యక్తిని ఎన్నుకుంటే బాగుంటుందనే ఆలోచన వచ్చింది కొందరు విద్యావంతులకీ! అనుకోవడమే తడువుగా రెల్లిపల్లి యెండుబాబు దగ్గరికి రాయబారం వెళ్లి అతడిని ప్రెసిడెంటుగా నిలబడమని యెగదోసేరు!

ఆ రాత్రి, పందుబాబు, తన తైనాతీలతో కలిసి, పరిస్థితుల్ని సమీక్షించుకున్నాడు! దిబ్బవలసలో వున్న వోటర్లు సుమారు మూడు వందలు! రెల్లిపల్లిలో వున్నవి సుమారు రెండు వందలు! పోలింగు దిబ్బవలసలో జరుగుతుంది! అదిగాక - వాళ్ళు మన వూళ్లో కలిసేరు! అంచేత మనం ప్రెసిడెంటు పదవి వొదులుకోకూడదు! మనం మరీ చులకనైపోతాం! మారీచుడిలాంటి ఆ యెండుబాబు ఆటలకి అడ్డువుండదు! కాబట్టి పందుబాబే ప్రెసిడెంటుగా వుండాలని తీర్మానించేరు! ఇదేరకమైన నిర్ణయం రెల్లిపల్లిలో కూడా జరిగింది! ఈ సమస్యని పరిష్కరించుకోవడానికి రెండు గ్రామాల పెద్దలు సమావేశం కావాలని నిర్ణయించేరు! రెండు వూళ్ళలోని విద్యావంతులు!... ఆ నిర్ణయం ప్రకారం దిబ్బవలసకి ఆ చివర్న - అంటే రెల్లివలస వేపున్నా చెరువుగట్టు మీద రావిచెట్టు కింద సమావేశాన్ని ఏర్పాటు చేశారు!

అనుకున్నట్టుగానే రావిచెట్టు కింద సమావేశం ప్రారంభమైంది! కుశల ప్రశ్నల తరువాత యెండుబాబు తైనాతీలు నేరుగా రంగంలోకి దిగేరు! వాళ్ళవాదనలు వినిపించి, సలహాలు చెప్పేరు! దిబ్బవలస వాళ్ళు ఒప్పుకోలేదు! చర్చలు వాడిగా వేడిగా జరుగుతున్నాయి.

"చూడు పందుబాబు! ముప్పయ్యేళ్ళ నుంచీ నువ్వే ప్రెసిడెంటువి! కాదనం! ఈపాలి మాకొగ్గెయ్! మాం కలిసేం కాబట్టి ఇది దర్మం, నాయం!" అన్నాడో పెద్ద.

"ఏటి వొగ్గీడంవయ్యా!? ఇదేంవన్నా ఆవా? గేదా?... పెసిడెండు పదవి! దానికి ముప్పయ్యేటి నలభై యేల్దేది?... ఓపిక, అవకాశం వున్నాన్నాళ్లూ వుండడమే అదీగాక మీరు కొత్తగా మాలో కలిసేరు!... అంచేత మాకే ఆపద వొగ్గీసి, మరోటి మీరుంచుకొండి! ఇదే దర్మం, నాయం!" అన్నాడు.

"ఓ యెల్లకోవోయ్! ముప్పయ్యేళ్ళు పెసిడెంటుగా చేసిన మీ పందుబాబు వూరికి వెల్ట్రీ బుడ్డీలైనా తీసుకు రాలేదుకానీ..."

"మరలాంటి మాటతేవొద్దు! వెల్ట్రీ తేవడానికదేం నన్నా బజార్లో దొరికేసరుకా? గవర్మెంటు వాడియ్యాల! దానికెంత డబ్బుకరుసవుద్దో నీకెరికా?... అయినా మా పందుబాబు వొల్లకున్నాడా.... మా వూళ్లో కిరసనాయిలు దీపాలెట్టించినాడు..."

"తెలుసులేవయ్యా! ఆ దీపాలు మూన్నాళ్ళూ వెలిగించి మూలచేరాయి? వొట్టి రాటలు మాత్రం మిగిలేయి? రాతుర్లు వూర్లో తిరిగే వాళ్ళు వాటిని తన్ను కొనిపడి కాళ్ళు, చేతులు విరుచుకొన్నారు! మాం వెరగవేటి?"

"దోనలాగే! మావోడు రాటలు పాతించేడు! లైట్లు లేనప్పుడు వూరిజనం సొంత లైట్లెట్టుకుని తిరగడానికి అలవాటు పడ్డారు! మరి మా వూళ్లో మీకు వెల్ట్రీ వస్తాదని, తంబాల కోసం గాతలు దీస్తే దాన్లోపడి, కాళ్ళు సేతులు యిరుచుయున్న జానీలెంతమందిసెప్పు!

ఈ సంభాషణ యిలా సాగేదేమో కాని పందుబాబు తన ముఖ్యతైగా తీని రంగంపోదికి తెచ్చేడు! "ఓరయ్యా! మరయిన్నీ యిప్పుడేల? ఈపాలికి మా పండోడు నిలవడం కాయం! మీకు దయఁడి, మనసు పడితే ఆడ్ని గెలిపించండి! నేదంటారా! వెలక్సనెలాగో వుంది!" అన్నాడు!

దాంతో ఆ సమావేశం అలా ముగిసింది! రెండూళ్ళ వాళ్ళూ పోటీకి పెట్టాలని తీర్మానించు కున్నారు.

ఎలక్షన్లు రానే వచ్చేయి! పందుబాబు, యెండుబాబు ప్రెసిడెంటు పదవికి పోటీ పడ్డారు. - పందుబాబు గుర్తు కప్పు-సాసరు. యెండు వాడి గుర్తు 'రిక్షా' - ప్రచారం బాగా వూపందుకొంది!... యెండు వాడు రెండు రోజుల ముందు రిక్షాలతో పెద్ద ర్యాలీ నిర్వహించేడు! అంత బ్రహ్మాండమైన వూరేగింపు ఆ కుగ్రామంలో అంతకు ముందెప్పుడూ జరగలేదు! ఎవరూ చూడలేదు! యెండు వాడు కొత్త పద్ధతులన్నీ ప్రవేశపెట్టి ప్రచారం చేసేడు! ... ఆ వృద్ధాప్యం చూసి వాడి గెలిచేస్తాడేమోనని అంతా అనుకున్నారు! పందు బాబుని అందరూ పరమచవట అనుకున్నారు! పందుబాబు ఒకే మాట చెప్పేడు, "నాకే వూరేగింపుల మీద నమ్మకం లేదు! మనోళ్ళంతా వోటర్లని వాళ్ళ యిళ్ళ దగ్గర కలిసి చెప్పాలి. అంతేగాని వూరేగింపులవీ మనకొద్దు" వాళ్ళ వర్గం వాళ్ళకి పందు బాబు వ్యూహం అర్థం కాలేదు! ఈసారి యెండువాడు ప్రెసిడెంటు కావడం తథ్యం అనుకున్నారంతా ఆ ప్రచార శైలి చూసి!

ఎలక్షన్ రోజు వచ్చింది!!... పోలింగు జరిగింది!! ఫలితాలు ప్రకటించారు!... కాని ఆశ్చర్యం... రెండు వందల వోట్ల మెజారిటీతో పందుబాబు గెలిచేడు!.... ఇదెలా జరిగింది? పందుబాబుని అడిగితే - 'అవతలోడ్ని బాగా అలిసిపోనివ్వాల! అప్పుడు మన బలం చూపాల!... ఎగిరిదంచినా, కూకోని దంచినా అదే కూలి!... మనం రెండోది యెంచుకున్నాం!... ఇప్పటికైనా తెలిసిందా... ఎలక్సనంటే మందు పేకెట్లు, సొమ్ము సంచులూను! ఇదంతా దాని మహిమే!" అన్నాడు చిద్విలాసంగా నవ్వుతూ!!

■

## ఆలాపన

ఎప్పుడో ఒకప్పుడు,
ఎక్కడో ఒకచోట,
కోరికల విహంగాలు
రెక్కలు విప్పుకొని
సుదీర తీరాలకు ఎగురుతాయి!
ఎక్కడో ఒకచోట
ఏదో ఒకరోజు
దూరానా మెరుస్తున్న ధృవతార
నా జీవనపథానికి మార్గదర్శం కాగలదు!
అప్పటివరకు - నేనిలా
ఈ తీరాన - నింగిలోకి
చేయిజాచి నిలబడతా;
అందని ఆ జాబిల్లికోసం;
అందమయిన కలలుగంటా!
ప్రభూ! ఈలోగానే
నాకని - నీవు పంపిన
నావ దరికి చేరుతోంది
ఏకాంత యానానికి! ఆవలిగట్టు అన్వేషణకి!
మరి స్థిరమవావి క్రొత్తవింత అనుభవాలకి!
నింగి-నేల కలిశేచోట
తొంగి చూడాలనుకుంటున్నా
సృష్టి స్థితిలిదుకారా / నీ నిరాకార రూపాన్ని! కానీ-
నీవు ప్రసాదించిన ప్రకృతిలో
అణువణువు రసాస్వాదన చేస్తూనే
నిన్ను తెలుసుకోలేని నేను
నిన్నెలా కలుసుకోగలను!
ఈ వింత ప్రకృతి స్వభావానికి
కాశింత ఆకృతి ప్రసాదించు ప్రభూ!
అరుణోదయ తొలికిరణం
స్పృశించగానే అంకురార్పణ జరిగింది
నాలోని ఈ ఉత్తేజితేజోవిరాజానికి!
కనీసం - నీ చరణాలగోరంచున
'ఆన'గా నిలిచిన మంచు బిందువు చందాన
ఒక్క క్షణం వో వెలుగు వెలగనీ - నీ
కరుణా కటాక్షాల వీక్షణాల రక్షణలో!
నా జన్మధన్యత గాంచనీ; నీ సమారాధనలో - వో
సమిదినయి! / ఇదే నా ఆలాపన!
మీదే నా ఆరాధన!

-ప్రగడ